క్లుప్తంగా

శతావధాని సందీప్‌కు పురస్కారాలు



సందీప్‌ను సత్కరిస్తున్న నిర్వాహకులు

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం బయోటెక్నాలజీ విభాగం పరిశోధక విద్యార్థి శతావధాని తాతా సందీప్ శర్మకు శ్రీగురు పురస్కారం, ప్రవచన బాదరాయణి బిరుదు లభించాయి. ఆదివారం ఏలూరు నగరంలో అఖిల భారతీయ బ్రాహ్మణ మహాసంఘ్(ఏబీబీఎం) రాష్ట్ర వార్షిక సమావేశాల్లో భాగంగా ఈ పురస్కారాలను సందీప్‌కు అందించారు. రాష్ట్ర దేవదాయ ధర్మదాయ శాఖ సలహాదారు జ్వాలాపురపు శ్రీకాంత్, ఏబీబీఎం రాష్ట్ర అధ్యక్షుడు ఇంద్రకంటి ప్రసాద్‌శర్మ చేతుల మీదుగా ఆయన ఈ పురస్కారాలు అందుకున్నారు. సందీప్ ఇప్పటి వరకు 400కిపైగా సాహిత్య, ధార్మిక, ఆధ్యాత్మికోపన్యాసాలు, ప్రవచనాలు చేశారు. సందీప్ బయోటెక్నాలజీ విభాగంలో ఆచార్య జి.సుధాకర్ పర్యవేక్షణలో పీహెచ్‌డీ చేస్తున్నారు.

ఉత్సాహంగా సంస్కృత భాష శోభాయాత్ర



సాగరతీరంలో శోభాయాత్ర నిర్వహిస్తున్న సంస్కృత భారతీ సంస్థ ప్రతినిధులు

బీచ్ రోడ్డు: సంస్కృత భాష ప్రచారంలో భాగంగా ఆదివారం సంస్కృత భారతీ ఆధ్వర్యంలో సాగరతీరంలో శోభాయాత్ర నిర్వహించారు. సంస్కృత భాష శిబిరాలు, బాల సంస్కార కేంద్రాలు, సంస్కృత పరీక్షలకు ఉచిత శిక్షణ కేంద్రాలను ఈ శోభయాత్రలో తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సంస్కృత భారతీ ప్రాంతీయ కార్యదర్శి రాంకుమార్, జనపద అధ్యక్షుడు సుందరరాజ్ పెరుమాళ్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా స్నేహితుల దినోత్సవం

ఆరిలోవ: ముడసర్లోవ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం స్నేహితుల దినోత్సవం ఘనంగా జరిగింది. ముడసర్లోవ సమీప స్కిల్ డెవలప్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్ పక్కన వాకర్స్ అసోసియేషన్ కార్యాలయం ఆవరణలో సభ్యులు ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. వృద్ధులు, యువకులు ఆనందోత్సవాల మధ్య కేక్ కట్ చేసి సభ్యులంతా కలసి ఒకరికొకరు తినిపించుకొని శుభాకాంక్షలు చెప్పుకున్నారు. మహిళలు సైతం పాల్గొని పాటలు పడుతూ సరదాగా గడిపారు.

5 కేజీల గంజాయి స్వాధీనం

ఎంవీపీ కాలనీ: అక్రమంగా గంజాయి తరలిస్తున్న ఏడుగుర్ని టాస్క్‌ఫోర్స్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పెదజాలరిపేట వాల్తేర్ డిపో ప్రాంతంలో ఆదివారం వారిని అదుపులోకి తీసుకుని, 5 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై ఎంవీపీ పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

అప్పన్నకు విశేషంగా ఆర్జిత సేవలు

సింహాచలం : శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం వైభవంగా ఆర్జితసేవలు జరిగాయి. ఉదయం 7 గంటల నుంచి స్వర్ణపుష్పార్చన ఘనంగా నిర్వహించారు. ఆలయ కల్యాణ మండపంలో స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను ఆశీనులను చేశారు.108 స్వర్ణసంపెంగ పుష్పాలతో స్వామికి అష్టోత్తర శతనామావళి పూజ నిర్వహించారు. అలాగే స్వామికి ఆదివారం ఉదయం 9.30 గంటల నుంచి ఘనంగా నిత్యకల్యాణం నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు. అనంతరం వరాహ లక్ష్మీనృసింహస్వామికి గరుడసేవ వైభవంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలో స్వామివారి ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని గరుడవాహనంపై అధిష్టింపజేసి, అష్టోత్తర శతనామావళి పూజ నిర్వహించారు.

ఆరోగ్య ప్రదాయిని ఆర్‌సీడీ ఆస్పత్రి

- ప్రత్యేక అవసరాల పిల్లలకు చికిత్స
- అందుబాటులో ఫిజియో, స్పీచ్ థెరపీలు



వంకర పాదాలు కలిగిన చిన్నారిని పరిశీలిస్తున్న సూపరింటెండెంట్ డాక్టర్ మురళీకృష్ణ



ఫిజియోథెరపి సేవలు అందిస్తున్న సిబ్బంది

ఏయూ క్యాంపస్: ప్రత్యేక అవసరాల చిన్నారులకు ఆరోగ్య ప్రదాయినిగా పెదవాల్తేరులోని రాణిచంద్రమణి దేవి(ఆర్‌సీడీ) ప్రభుత్వ ఆస్పత్రి నిలుస్తోంది. చిన్నారులకు అందించే చికిత్సలు వారిని సాధారణ స్థితికి తీసుకురావడానికి ఎంతగానో దోహదపడుతున్నాయి. ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి చికిత్స నిమిత్తం వందలాది మంది చిన్నారులు ఆస్పత్రికి వస్తుంటారు. ఇక్కడ నాణ్యమైన వైద్యం పొంది ఆరోగ్యంగా వెళ్తున్నారు. పొరుగు రాష్ట్రాల ప్రజలు సైతం ఈ ఆస్పత్రిలో చికిత్స పొందడం గమనార్హం.

వంకర కాళ్లకు చికిత్స

ఆర్‌సీడీ ఆస్పత్రికి వచ్చే చిన్నారుల్లో అధిక శాతం మంది జన్మతా సంక్రమించే వంకర కాళ్ల సమస్యతో వచ్చిన వారే. వారిని పరిశీలించి ప్రత్యేకంగా పీవోపీ కట్టు వేసి వంకరకాళ్లను సరిచేసేలా వైద్యులు కృషి చేస్తున్నారు. కొంత మందికి దీంతో పాటు స్వల్ప శస్త్రచికిత్స కూడా అవసరం అవుతుంది. అలా శస్త్ర చికిత్స కూడా చేసి, పూర్తి ఆరోగ్యంతో వెళ్లేలా ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది పని చేస్తున్నారు. ఇక్కడ నెలకు 40 నుంచి 60 వరకు శస్త్ర చికిత్సలు జరుగుతున్నాయని ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ మురళీకృష్ణ తెలిపారు.

స్పీచ్ థెరపీ.. ఫిజియోథెరపీ..

కొంత మంది పిల్లల్లో జన్మతా కొన్ని శారీరక సమస్యలు వస్తుంటాయి. ఇటువంటి వారికి అవసరమైన స్థాయిలో ఫిజియోథెరపీ సేవలు అందిస్తున్నారు. ఇక్కడ సుశిక్షితులైన సిబ్బంది నిత్యం శారీరక వైక్యలం కలిగిన చిన్నారులకు అవసరమైన ఫిజియోథెరఫి సేవలు ఎంతో ఓర్పుతో చేస్తున్నారు. అలాగే కొంత మంది చిన్నారుల్లో మాటలు రావడం ఆలస్యం అవుతుంది. అటువంటి వారికి అవసరమైన స్పీచ్‌థెరఫి సేవలు సైతం ఆస్పత్రిలో అందుబాటులో ఉన్నాయి. మస్తిష్క పక్షవాతం(సెరిబ్రల్ పాల్సీ) సమస్య కలిగిన చిన్నారులకు ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు. వీరి కోసం సుశిక్షితులైన సిబ్బంది ప్రత్యేకంగా తర్ఫీదును ఇస్తూ చిన్నారులు తమ దినచర్యలు సక్రమంగా చేసుకునేలా అవగాహన కల్పిస్తున్నారు.

కొత్త పరికరాల కొనుగోలుకు ప్రభుత్వ అనుమతి

ఆస్పత్రి అవసరాలకు అనుగుణంగా అవసరమైన పరికరాలు కొనుగోలు చేస్తున్నారు. తాజాగా రూ.5 లక్షలతో నూతన పరికరాలను కొనుగోలు చేయడానికి ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. ఆస్పత్రికి వచ్చే రోగుల సౌకర్యార్థం కొత్తగా లిఫ్ట్ సదుపాయం ఏర్పాటు చేయనున్నారు. ఆరోగ్యశ్రీ ఉపయోగించుకుని ఇక్కడ సేవలు పొందే అవకాశం కూడా ఉందని సూపరింటెండెంట్ మురళీకృష్ణ తెలిపారు.



ఆర్‌సీడీ ఆస్పత్రి



స్పీచ్ థెరపీలో శిక్షణ ఇస్తున్న అధ్యాపకురాలు

అణ్వస్త్ర రహిత ప్రపంచం కోసం కృషి



బాలికల గృహంలో మాట్లాడుతున్న నరవ ప్రకాశరావు

ఆరిలోవ: బాల వికాస్ ఫౌండేషన్, ఇంటర్నేషనల్ అసోసియేషన్ ఫర్ రిలీజియస్ ఫ్రీడం సంయుక్త ఆధ్వర్యంలో రూరల్ మండల కార్యాలయం సమీపంలోని ప్రభుత్వ బాలికల గృహంలో ఆదివారం హిరోషిమా సంస్మరణ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా బాలవికాస్ ఫౌండేషన్ అధ్యక్షుడు నరవ ప్రకాశరావు మాట్లాడుతూ రెండో ప్రపంచ యుద్ధం సమయంలో అమెరికా.. జపాన్ దేశంలో హిరోషిమా నగరంపై దాడిచేసి 78 సంవత్సరాలు పూర్తయిందన్నారు. ఆ దాడిలో ఆమెరికా ఉపయోగించిన అణ్వస్త్రాలు కారణంగా హిరోషిమా నగరం నాశనమైందని తెలిపారు. అందరూ అణ్వస్త్ర రహిత ప్రపంచం కోసం కృషి చేయాలన్నారు. దేశాల్లో ఉన్న అణుశక్తిని శాంతియుత ప్రయోగాల కోసం మాత్రమే ఉపయోగించాలని కోరారు. విద్యార్థులు చిన్నతనం నుంచే శాంతియుతమైన వాతావరణం అలవాటు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గృహం సూపరింటెండెంట్ సునీత, సిబ్బంది పాల్గొన్నారు.

తీరంలో స్వచ్ఛ భారత్



జోడుగుళ్లుపాలెం బీచ్‌లో సేకరించిన చెత్త మూటలతో సీఆర్‌పీఎఫ్ అధికారులు, జెడ్సీ కనకమహాలక్ష్మి

ఆరిలోవ: జోడుగుళ్లపాలెం వద్ద సముద్ర తీరంలో ఆదివారం సీఆర్‌పీఎఫ్ అధికారులు స్వచ్ఛ భారత్ కార్యక్రమం చేపట్టారు. ముఖ్యఅతిథిగా హాజరైన జీవీఎంసీ జోన్–2 కమిషనర్ కనకమహాలక్ష్మి, అధికారులు, పారిశుధ్య సిబ్బంది ఇక్కడ బీచ్‌లో చెత్త సేకరించారు. పాలిథిన్ కవర్లు, ఖాళీ కొబ్బరి బొండాలు, క్లాత్‌లు, పిచ్చి మొక్కలు సేకరించి శుభ్రం చేశారు. ఆ చెత్తను పారిశుధ్య కార్మికులకు మూటలు కట్టి అప్పగించి డంపింగ్‌యార్డుకు తరలించారు. అనంతరం జోడుగుళ్లపాలెం వద్ద పచ్చదనం కోసం మొక్కలు నాటారు.

నవ్వుల్లో ముంచెత్తిన వినోదాల విందు



కామెడీ స్కిట్ ప్రదర్శిస్తున్న సుబ్రహ్మణ్యం, జబర్దస్త్ ప్రకాశ్

సీతంపేట: ఫ్రెండ్స్ కామెడీ క్లబ్ నెలవారీ కార్యక్రమంలో భాగంగా ఆదివారం సాయంత్రం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో నిర్వహించిన వినోదాల విందు కామెడీ షో ప్రేక్షకులను అలరించింది. క్లబ్ వ్యవస్థాపకుడు ఎం.వి.సుబ్రహ్మణ్యం, జబర్దస్త్ ప్రకాశ్, డేవిడ్‌రాజు, రావి గోపీకృష్ణ, శివజ్యోతి, భానుప్రకాష్, నాంచారయ్య, నాగ గణేష్, రంగారావు, త్రినాథ్, భాస్కరాచారి, దుర్గాప్రసాద్, పుష్పమి, అన్వేషు, శివ, మల్లిక, సీత ప్రదర్శించిన కామెడీ స్కిట్లు కడుపుబ్బా నవ్వించాయి. వీటిలో కుక్క కరిచింది, కవితల పోటీ, జస్ట్ ఫర్ చేంజ్, హిందీ నేర్చుకునేందుకు, షాపింగ్, కుక్క తినేసింది, డిగ్రీ పోయింది, టీవీ యాంకర్, వదిన స్కిట్లు ఆహుతులను నవ్వుల్లో ముంచెత్తాయి. కార్యక్రమంలో దాడి సత్యనారాయణ, నండూరి రామకృష్ణ, తిలక్ పట్నాయక్, బి.మాల్యాద్రి, బాందంగీర్ సాయి తదితరుల చేతుల మీదుగా కేక్ కట్‌చేసి ఫ్రెండ్‌షిప్ డే శుభాకాంక్షలు తెలిపారు.

ఇస్కాన్‌లో ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో రాధాకృష్ణులు

కొమ్మాది: సాగర్‌నగర్ ఇస్కాన్ మందిరంలో ఆదివారం వారాంతపు పూజల్లో భాగంగా హరేకృష్ణ, హరేరామ నామస్మరణతో ప్రత్యేక పూజలు చేశారు. రాధాకృష్ణులు, సుభద్ర, బలభద్ర జగన్నాథుడు, సీతారాములు, ఆంజనేయ, నరసింహస్వామి విగ్రహాలను వివిధ వర్ణాల పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. స్వామి వారి లీలలు, మహిమలను వర్ణిస్తూ భక్తులు భజనలు, గీతాలాపన చేశారు.

చుండూరు హంతకులను శిక్షించాలి



జీవీఎంసీ గాంధీ పార్కులో నిరసన తెలియజేస్తున్న దళిత విముక్తి ప్రతినిధులు

సీతమ్మధార : చుండూరు హంతకులను శిక్షించాలని కోరుతూ జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద దళిత విముక్తి ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. 32 ఏళ్లయినా చుండూరు దళితుల హత్యాకాండలో బాధితులకు న్యాయం జరగలేదని వాపోయారు. ఈ సందర్భంగా దళిత విముక్తి రాష్ట్ర కన్వీనర్ సుర్ల వెంకటరమణ, దళిత హక్కుల సమాఖ్య విశాఖ జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి వెంకటరమణ మాట్లాడుతూ 1991 ఆగస్టు 6న చుండూరులో దళితులపై మారణకాండకు పాల్పడి ఎనిమిది మందిని హతమార్చారని గుర్తు చేశారు. ఈ కేసులో సాక్ష్యాధారాలు ఉన్నప్పటికీ 13 ఏళ్ల తర్వాత పాక్షిక న్యాయమే జరిగిందన్నారు. దేశంలో అనేక కేసులు ఫాస్ట్‌ట్రాక్ కోర్టుల ద్వారా పరిష్కరిస్తున్నారని, దళితుల కేసులో మాత్రం తీవ్ర జాప్యం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో బంకపల్లి అప్పారావు, రామకృష్ణ, బి.సన్యాసిరావు, కె.కుమార్, వీఎస్ కృష్ణ, హుస్సేన్, రాంప్రభు, గురవయ్య, సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

రైతుల స్టాళ్లకు డ్రా



స్టాల్ టోకెన్ అందిస్తున్న ఈవో కొండబాబు

సీతమ్మధార: సీతమ్మధార రైతుబజార్‌లోని స్టాళ్లకు ఆదివారం ఈవో కొండబాబు డ్రా తీసి రైతులకు టోకెట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మట్లాడుతూ మార్కెటింగ్ శాఖ అధికారుల ఆదేశాల మేరకు పది రోజులకు గానూ ఉదయం, సాయంత్రం వేళ స్టాళ్లకు సంబంధించి డ్రా తీసి రైతులకు కేటాయిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో రైతుబజార్ సహాయకుడు సతీష్, రైతులు పాల్గొన్నారు.

ఎర్నిమాంబ ఆలయానికి భక్తుల తాకిడి



ఎర్నిమాంబకు ప్రత్యేక పూజలు చేస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ తదితరులు

కంచరపాలెం : జీవీఎంసీ 41వ వార్డు జ్ఞానాపురం పరిధి కాన్వెంటు కూడలిలో వెలసిన ఎర్నిమాంబ అమ్మవారి ఆలయం అధిక శ్రావణమాస శుద్ధ అష్టమి ఆదివారాన్ని పురస్కరించుకుని భక్తులతో కిటకిటలాడింది. ఆలయ ప్రధాన అర్చకులు పులఖండం శ్రీకాంత్‌శర్మ ఉదయం నుంచి అమ్మవారికి కుంకుమ పూజలు, విశేషార్చనలు, అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు ప్రత్యేక ఉచిత దర్శనాలు ఏర్పాటు చేశారు. ఈవో డీవీఎస్ సురేష్‌బాబా, ఆలయ సిబ్బంది భక్తుల సౌకర్యాలను పర్యవేక్షించారు.

మొక్కులు తీర్చుకున్న ఎమ్మెల్యే వాసుపల్లి

ఎర్నిమాంబ అమ్మవారికి ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్ కుటుంబ సభ్యులతోను, పార్టీ నాయకులతో కలిసి ఆదివారం మొక్కులు చెల్లించుకున్నారు. ముందుగా వార్డు కార్పొరేటర్, స్టాండింగ్ కమిటీ సభ్యురాలు కోడిగుడ్ల పూర్ణిమ, శ్రీధర్ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వాసుపల్లి మాట్లాడుతూ 2024 ఎన్నికల్లో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మరల సీఎంగా గెలవాలన్నారు. అనంతరం 101 కొబ్బరికాయలు కొట్టి మొక్కు తీర్చుకున్నారు. ఎమ్మెల్యే ఏర్పాటు చేసిన విందులో వివిధ శాఖల చైర్మన్లు, మాజీ ఎమ్మెల్యేలు, కార్పొరేటర్లు, వార్డు అధ్యక్షులు, జేసీఎస్ ఇన్‌చార్జిలు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎంబీఏ మోనిటరీ మేనేజ్‌మెంట్ పుస్తకావిష్కరణ

దాబాగార్డెన్స్ : ఎంబీఏ నాల్గో సెమిస్టర్‌కు సంబంధించి మోనిటరీ మేనేజ్‌మెంట్ పుస్తకాన్ని రచయితలు డాక్టర్ సతీష్ వాడపల్లి (అపోలో ఆస్పత్రి పీడియాట్రిక్స్ అండ్ నియోనాటాలజిస్ట్), సుప్రియ మౌనిక అర్జీలు ఆదివారం నగరంలోని ఓ హోటల్లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పుస్తక రచయితలు మాట్లాడుతూ ఇంత వరకు ఆంధ్ర విశ్వవిద్యాలయం ఎంబీఏ నాల్గో సెమిస్టర్‌కు నిర్దిష్టమైన పుస్తకం లేకపోవడంతో వారు పలు ఇబ్బందులు ఎదుర్కొన్నారన్నారు. విద్యార్థులను దృష్టిలో పెట్టుకుని అవసరమైన సిలబస్ ప్రకారం రెండో సంవత్సరం ఎంబీఏ విద్యార్థులకు అందుబాటులోకి తీసుకు వచ్చామన్నారు. ఈ పుస్తకం ప్రస్తుతం అమెజాన్ ప్లాట్‌ఫామ్‌లో లభిస్తుందన్నారు. కార్యక్రమంలో గంటా రమేష్, ఏవీ కోటేశ్వరరావు, డాక్టర్ ఉమానాగేశ్వరి, డాక్టర్ పి. నాగవల్లి, హైమావతి ధూళి, ఎం. సత్యవతి, కేఎస్ కుమార్, జీవీఎంసీ అదనపు కమిషనర్ డాక్టర్ వి. సన్యాసిరావు, ఏసీపీ రాఘవేంద్రరావు పాల్గొన్నారు.

ఆటో ఢీకొని బాలుడికి గాయాలు

మద్రిపాలెం: ఆటో ఢీకొని ఓ చిన్నారికి గాయాలైన ఘటన కంచరపాలెం ఐదో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలిలా.. గవర కంచరపాలెంలోని హనుమాన్ ఆలయం వద్ద తల్లిదండ్రులతో కలిసి నివసిస్తున్న ఆరేళ్ల మళ్ల నవదీప్ శనివారం సాయంత్రం 4 గంటల ప్రాంతంలో ఇంటి ముందు సైకిల్‌తో ఆడుకుంటున్నాడు.. ఆ సమయంలో అటుగా వస్తున్న ఆటో ఢీకొనడంతో ఆ బాలుడికి గాయాలయ్యాయి. వెంటనే సమీపంలోని ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. తండ్రి మళ్ల అనీల్‌కుమార్ ఫిర్యాదు మేరకు ఆదివారం సీఐ ఎస్.సాయి నేతృత్వంలో హెడ్ కానిస్టేబుల్ రమేష్‌రెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ద్విచక్ర వాహనాల వేలం నేడు

మద్రిపాలెం: స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో(సెబ్) మురళీనగర్ వద్ద ఉన్న గోపాలపట్నం సర్కిల్–4 కార్యాలయంలో ఈ నెల 7న ద్విచక్ర వాహనాల వేలం వేయనున్నట్టు సెబ్ ఇన్‌స్పెక్టర్ సిహెచ్.వి.ఎస్.ప్రసాద్ ఆదివారం ఒక ప్రటనలో తెలిపారు. వివధ ఎక్సైజ్ నేరాల్లో పట్టుబడిన వాహనాలను సోమవారం మధ్యాహ్నం 2.30 గంటలకు సెబ్ డిప్యూటీ కమిషనర్ ఎస్.వి.వి. ఎన్.బాబ్జి, సెబ్ అధికారు ల ఆదేశాల మేరకు వారి సమక్షంలో వేలం వేస్తామన్నారు. వివరాలకు 94409 02382 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

టీవీ మెకానిక్‌లకు చేయూత అవసరం



సమావేశంలో పాల్గొన్న టీవీ మెకానిక్‌లు

ఆరిలోవ: టీవీ మెకానిక్‌లకు ప్రభుత్వం చేయూతనివ్వాలని విశాఖ టీవీ మెకానిక్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు వి.వెంకట్ కోరారు. విశాఖ టీవీ మెకానిక్ వెల్ఫేర్ అసోసియేషన్ సర్వసభ్య సమావేశం ఆదివారం ఆరిలోవ ప్రాంతం బాలాజీనగర్‌లోని ఓ సామాజిక భవనంలో జరిగింది. నగరంతో పాటు జిల్లా వ్యాప్తంగా ఉన్న టీవీ మెకానిక్‌లు హాజరైన ఈ సమావేశంలో అసోసియేషన్ అభివృద్ధికి తీసుకోవాల్సిన కార్యాచరణ గురించి చర్చించారు. మారుతున్న టెక్నాలజీకి అనుగుణంగా అవసరమైన మెకానిజం, వినియోగించాల్సిన పరికరాలపై చర్చించారు. ఈ సందర్భంగా వెంకట్ మాట్లాడుతూ ఆధునిక టెక్నాలజీతో తయారవుతున్న టీవీలకు మరమ్మతులు చేయాల్సిన సమయంలో ఆధునికమైన పరికరాలు వాడాల్సి వస్తుందన్నారు. వాటి ధరలు ఎక్కువగా ఉన్నాయన్నారు. జీవనోపాధి కోసం ఈ వృత్తి చేపడుతున్న మెకానిక్‌లకు ప్రభుత్వం సహాయం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ కార్యదర్శి ఎస్.దిలీప్, తదితరులు పాల్గొన్నారు.

అలరించిన వనితల ర్యాంప్ వాక్



సంప్రదాయ వస్త్రధారణలో మహిళలు

ఎంవీపీ కాలనీ: వెంకోజీపాలెంలోని సీఎంఆర్ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం జరిగిన మహిళల ర్యాంప్ వాక్ అలరించింది. వీ డెంటల్ సంస్థ ఆధ్వర్యంలో మహిళల్లో చైతన్యం కోసం శ్రావణ లక్ష్మి పేరిట ఆదివారం సాయంత్రం ఈ పోటీలు నిర్వహించారు. వివాహితులతో పాటు యువతులు ఈ పోటీల్లో ఉత్సాహంగా పాల్గొని సంప్రదాయ చీరకట్టు, పరికిణి ఓణీల్లో ర్యాంప్ వాక్ చేస్తూ సందడి చేశారు. పలువురు యువతులు నృత్య ప్రదర్శనతో ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు అనురాధ, వైఎస్సార్‌సీపీ నాయకురాలు పేడాడ రమణికుమారి, క్వీన్స్ ఈవెంట్స్ ఉషారాణిజ్యోతి, తదితరులు పాల్గొన్నారు.

తీరనున్న పార్కింగ్ కష్టాలు



పనులు పర్యవేక్షిస్తున్న ఏఈవో జగన్‌మోహనాచార్యులు

కొమ్మాది: రుషికొండలో గల శ్రీ మహాలక్ష్మి గోదాదేవి సహిత శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయ కొండపై భక్తులకు పార్కింగ్ కష్టాలు తీరనున్నాయి. శనివారం, ఆదివారం, ప్రముఖ పర్వదినాలు, ఇతర సెలవు రోజుల్లో శ్రీవారిని దర్శించుకునేందుకు వేల సంఖ్యలో భక్తులు వస్తుంటారు. ఈ నేపథ్యంలో వందలాది వాహనాలు కొండపైకి చేరుకుని పార్కింగ్ చేసుకునేందుకు నానావస్థలు పడేవారు. అయితే ఈ సమస్యను పరిష్కరించే దిశగా టీటీడీ అధికారులు చర్యలు చేపడుతున్నారు. ఆలయ వెనుక భాగాన ఉన్న ఖాళీ స్థలాన్ని చదును చేయించి పార్కింగ్‌కు సరిపోయేలా ప్రణాళిక రూపొందించారు. ఇందులో భాగంగా ఆదివారం ఆ పనులను ఆలయ ఏఈవో జగన్‌మోహనాచార్యులు, సూపరింటెండెంట్ వెంకటరమణ ప్రారంభించారు. సుమారు వంద కార్లు, బైకులు పార్కింగ్‌కు సరిపడేలా ఏర్పాటు చేస్తున్నట్లు వీరు తెలిపారు.

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్



రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న ద్వారకా ఎస్ఐలు ధర్మేంద్ర, అప్పలరాజు

సీతమ్మధార: ఫోర్త్‌టౌన్ పోలీస్ స్టేషన్ ఆవరణ లో ఆదివారం రౌడీషీటర్లకు సీఐ శ్రీనివాసరావు కౌన్సెలింగ్ నిర్వహించి, వేలిముద్రలు సేకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో ఎటువంటి నేరాలు చేయకుండా సత్ప్రవర్తనతో మెలగాలని సూచించా రు. తగాదాలు, కొట్లాటల్లో తలదూర్చకుండా కుటుంబ సభ్యులతో కలిసి ఆనందంగా జీవించాలన్నారు. ఎటువంటి గొడవల్లో తలదూర్చి నా కఠిన చర్యలు తీసుకుంటామని రౌడీషీటర్ల ను సీఐ హెచ్చరించారు. పోలీస్ నిఘా ఎల్లప్పు డూ ఉంటుందని గుర్తుంచుకుని మంచిగా నడుచుకోవాలన్నారు. పలువురు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

మంచిగా జీవించండి

సీతమ్మధార: ద్వారకా జోన్ పోలీస్ స్టేషన్‌లో రౌడీషీటర్లకు సీఐ సింహాద్రినాయుడు ఆదేశాల మేరకు ఎస్ఐలు ధర్మేంద్ర, అప్పలరాజు కౌన్సెలింగ్ నిర్వహించారు. రౌడీషీటర్ల దినచర్య, సత్ప్రవర్తన కలిగి ఉంటున్నారా లేదా అనే విషయాలను అడిగి తెలుసుకున్నారు. ఎటువంటి తగాదాలు, కొట్లాటల్లో తలదూర్చకుండా మంచిగా జీవించాలని సూచించారు. కౌన్సెలింగ్ అనంతరం రౌడీషీటర్లను వారి ఇళ్ల వద్ద స్టేషన్ సిబ్బంది అప్పగించారు.

ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడుకుందాం



దీక్షలో పాల్గొన్న కార్మిక నాయకులు

సీతమ్మధార : ప్రజలకు సేవలందిస్తున్న ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేట్‌పరం కాకుండా కాపాడుకుందామని స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్ట్ లేబర్ యూనియన్ (సీఐటీయూ) నాయకుడు నమ్మి రమణ పిలుపునిచ్చారు. జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా అఖిలపక్ష కార్మిక సంఘాల ఆధ్వర్యంలో జరుగుతున్న నిరాహార దీక్షలు 857వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలన్నారు. బీజేపీ ప్రభుత్వం ప్రభుత్వ రంగ సంస్థలను స్వదేశీ, విదేశీ పెట్టుబడిదారులకు అమ్మేయాలని చూడటం అవివేకమన్నారు. కార్పొరేటీకరణ విధానాలు అమలు చేసిన ఏ దేశం అభివద్ధి సాధించలేదని గుర్తు చేశారు. ఇప్పకికైనా మోదీ ప్రభుత్వం ప్రైవేటీకరణ విధానాలు మానుకోవాలని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జి.శ్రీను, వి.వి.రామారావు తదితరులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్య వివాహ పరిచయ వేదికకు స్పందన

దాబాగార్డెన్స్ : ఆర్యవైశ్య యువజన సంఘం ఆధ్వర్యంలో ఆదివారం అల్లూరి విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన 41వ ఆర్యవైశ్య వధూవరుల వివాహ పరిచయ వేదికకు విశేష స్పందన లభించింది. సుమారు 350 మంది వధూవరులు పాల్గొని వారి జీవిత భాగస్వామిని ఎంచుకున్నారని సంఘం కార్యదర్శి పూసర్ల రమేష్ తెలిపారు. మరో ప్రతినిధి పీఎస్ మస్తాన్‌రావు మాట్లాడుతూ ఇంటర్నెట్ యుగంలో నెట్ ద్వారా పెండ్లి సంబంధాలు కుదుర్చుకుంటున్న సమయంలో కూడా సాంప్రదాయ పద్ధతిలో పెండ్లి చూపుల కార్యక్రమం నిర్వహించడం అభినందనీయమన్నారు. రాజుల కాలంలో కూడా స్వయంవరాల ద్వారా కేవలం అమ్మాయిలకు మాత్రమే పెండ్లి కొడుకును ఎంచుకునే అవకాశం కల్పించేవారని, అబ్బాయిలకు ఆ విధంగా అవకాశాలు కల్పించిన దాఖలాల్లేవన్నారు. కానీ ఇప్పుడు..అమ్మాయి, అబ్బాయిలకు కూడా జీవిత భాగస్వామిని ఎంచుకునే అవకాశం ఈ ఆధునిక స్వయంవరాల్లో కలగడం సంతోషకరమన్నారు. కార్యక్రమంలో కంకటాల గ్రూప్ ఆఫ్ కంపెనీస్ మేనేజింగ్ డైరెక్టర్ కంకటాల అనిరుధ్, నల్లూరి నూకరాజు, దుర్గా సోమేశ్వరరావు, గ్రంధి దుర్గాప్రసాద్, యలమర్తి గణేష్, విన్నకోట రామ్మూర్తి, సుగ్గు శివకుమార్, ఆరిశెట్టి దినకర్, పాలూరి వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.